# జారిన ఆకాశం

అది నేను కాలేజీలో అడుగిడిన తొలి దినాలు. మా పల్లెనుండి కాలేజ్ లో ప్రవేశించిన తొలి స్త్రీని నేను. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమైనా ఆ ఆచారం మా ఇంటి గుమ్మానికి నిత్యతోరణమై ఇంకా పచ్చగా మెరుస్తూనే వుంది. నే వివాహం అప్పుడే చేసుకోనని తిరస్కరించిన రోజు మా అమ్మ ఉరేసుకుంటానంది.

నాన్న గోదాట్లో దూకుతానన్నాడు. "నేనూ నీలాగే అప్పుడే పెళ్లొద్దని గొడవ చేశాను. కాని తప్పలేదు. అల్లరి చెయ్యకుండా పెళ్లికి ఒప్పుకో" అంది ఇరవై ఏళ్లకే. ముగ్గురు పిల్లల తల్లియై, వృద్ధురాలిగా కన్పిస్తున్న మా పెద్దక్క! అమ్మని వురేసుకోమన్నాను నాన్నని గోదార్లో దూకమన్నాను. నే కాలేజ్ లో జాయిన్ అయిపోయాను. అమ్మా, నాన్న ఇప్పుడు అందరితో గొప్పగా – "మా అమ్మాయి పట్నంలో చదువుకుంటుంది. స్త్రీకి విద్య ముఖ్యమని మన నాయకులు చెప్పుతున్నారుగా. వారి ఆశయాలు ఆచరించటమే నా జీవిత ధ్యేయం" అంటున్నాడు. మనకి అనుగుణంగా మాటల పొదరిళ్లు నేయటం చాలా తేలిక.

హైస్కూల్ నుండి కాలేజీకి రాగానే మన ప్రపంచం విశాలమైనట్టు అనిపిస్తుంది. కొత్త వాతావరణం, కొత్త కొత్త ముఖాలు. అది మహిళా కాలేజి. అమ్మాయిలంతా అప్పుడే పూచిన చిత్ర విచిత్రమైన పువ్వుల్లా మనోహరంగా వుండేవారు. అసలా కాలేజ్ అందంగా ఉండేది. ఎటు చూసినా పచ్చపచ్చని చెట్లు. రంగురంగు పూలు నిండిన పొదలు. హుషారుగా ఎగిరే సీతాకోక చిలకలు. అక్కడక్కడ రెల్లుగడ్డితో నేసిన పొదరిళ్లు. . విశ్వకవి కలలేవో ఇక్కడ రూపుదిద్దుకున్నాయా అనిపించేది.

లెక్చరర్స్ లో చాలామంది మహిళలే. మగ లెక్చరర్స్ చాలా కొద్దిమంది మాత్రమే వుండేవారు. మాకు జువాలజీకి వచ్చే లెక్చరర్ పేరు ఆకాష్. అంత చక్కని పేరు పెట్టిన

అతని తల్లిదండ్రుల్ని అభినందించాలి. ఆకాశం కంటే వున్నతమైనది లేదు నా దృష్టిలో. ఆకాష్ లెక్చర్ ఇస్తుంటే నాకెంతో ఆశ్చర్యంగా వుండేది. ప్రతి చాప్టర్ చాలా స్పష్టంగా, సరళంగా, శ్రావ్యంగా వివరించేవాడు. అది విని నిర్భయంగా పరీక్ష రాయవచ్చు. ఆ సబ్జక్ట్‌పై కమేండ్‌ని సంపాదించవచ్చు. అన్ని సబ్జక్ట్‌లకి ఇతనిలాంటి లెక్చరర్స్ వుండకూడదూ? ఉహు. అది అందరికీ సాధ్యం కాదు. అదో అపురూపమైన కళ. నేనీ కాలేజ్ వదిలి వెళ్లిపోవచ్చు. కాని ఆకాష్‌ని మర్చిపోలేను. భవిష్యత్తులో నేను ఓ లెక్చరర్ కావచ్చు. కాని ఆకాష్‌లా లెక్చర్ ఇవ్వలేను. అది ఓ వరం. క్లాస్ మరో పది నిమిషాలకి అయిపోతుందనగా చెప్పిన పాఠంపై ప్రశ్నలు వేసేవాడు. అందుకని అందరూ మరీ ఎలర్ట్‌గా పాఠం వినేవారు. జవాబు చెప్పకపోతే అంతమందిలో అవమానంగా వుంటుంది కదా. ఓరోజు నావైపు చూసి ప్రశ్న అడిగి ఆన్సర్ చెప్పమన్నాడు. జవాబు చెప్పి కూర్చుంటుంటే, "వాట్స్ యువర్ నేమ్?" అన్నాడు.

"మృదుల"

ఆ తర్వాత ప్రతి క్లాస్‌లో అతను 'మృదుల' అంటూ ప్రశ్నలు వేసేవాడు. మిగిలిన అందర్నీ పట్టించుకోవటం మానేసాడు. లెక్చరర్స్ ఇష్టపడే స్టూడెంట్స్ అంటే మిగిలిన స్టూడెంట్స్‌కి ఇష్టం. అప్పటికింకా అసూయ, ద్వేషం మనసుని తాకవు. అతను మా అందరికీ ప్రియమైన లెక్చరర్. కాని అతనికి ప్రియమైన స్టూడెంట్‌ని నేను.

ఓ రోజు లాబ్‌లో డిసెక్షన్ చేస్తున్నాం.

"వండర్‌ఫుల్"

వెనక్కి తిరిగి చూశాను.

ఆకాష్.

'వ్వాట్ సార్' అడిగాను.

"డిసెక్షన్".

"థేంక్యూ" అన్నాను ఆనందంగా.

"థేంక్స్‌తో సరిపెట్టుకుందాం అనుకుంటున్నావా?"

"లేదండి. ఇంకా ఇంకా బాగా చదువుతాను" అన్నాను.

"రేపు నా పుట్టినరోజు. మా ఇంటికిరా"

"ష్యూర్"

"ఎవ్వరితో ఈ విషయం చెప్పకు".

"ఎందుకు?"

"ఐ లవ్ యు. ఇది నా ఆహ్వానం. ఈ పదం నీకొక్కదానికే పరిమితం. ఇదిగో అడ్రస్. తప్పకుండా రా" అని నా జవాబు కోసం ఎదురు చూడకుండా వెళ్లిపోయాడు.

నా బుగ్గల్లోంచి వెచ్చని ఆవిరి అలలా ఎగిసింది. ఏమన్నాడు ఆకాష్? ఐ లవ్ యు - అంటే నిన్ను ప్రేమిస్తున్నానని చెప్పటం కదూ? అవును. అంటే పరోక్షంగా నిన్ను

పెళ్లిచేసుకుంటానని చెప్పటం కదూ? అవును. అంతే

ఆకాష్‌ని పెళ్లి చేసుకుంటే నా చదువు ఏమవుతుంది? పెళ్లి చేసుకొని చదువుకోవచ్చు. బి.ఏ. సెకండ్ ఇయర్ సుభద్ర, బి.యస్సీ, ఫైనలియర్ నాగకుమారి, బి.కామ్. ఫస్టియర్ రాధ పెళ్లి అయిన అమ్మాయిలే. అయినా చదువుకుంటున్నారుగా? నేనూ అలాగే చదువుకుంటాను. చూశారా నాకు ఇప్పుడు ఇంకా నేను వివాహం చేసుకోడానికి అర్హత పొందిన వయస్సుకి చేరుకోలేదని గుర్తు రావటం లేదు. మనసుకి కష్టం అనిపించినప్పుడే చట్టం గుర్తొస్తుంది.

అయినా ఇదేం ఆలోచన? ఆకాష్ లాంటి గొప్ప వక్త ఇంత తేలిగ్గా 'ఐ లవ్ యు' అని ప్రేమ గురించి మాట్లాడతాడా? నిస్సందేహంగా అతడికి నేనంటే అభిమానం వుంది. అది కేవలం చదువుకి సంబంధించినది. అతడంటే నాకు గౌరవం వుంది. అది అతని వృత్తికి సంబంధించింది. అంతే. అనవసరంగా ఆలోచించటం ఆరోగ్య లక్షణం కాదు.

ఆకాష్ ఇల్లు నిర్మల నిశ్శబ్దంగా వుంది. విషెస్ చెప్పి మౌనంగా కూర్చున్నాను. మ్యాంగో జ్యూస్ గ్లాసు అందించి నా ఎదురుగా కూర్చుని "మెరూన్ కలర్ నీకు బాగా నప్పుతుంది" అన్నాడు ఆకాష్.

"థేంక్యూ" చాలా ఇబ్బందిగా అన్నాను.

"ఇప్పటికి నీకెంతమంది లవ్ లెటర్స్ రాశారు?" అడిగాడు.

ఇదేం ప్రశ్న అనుకుంటూ "ఎవ్వరూ రాయలేదు" అన్నాను.

"నిజంగా?"

"నిజంగానే..."

"ప్రామిస్" అంటూ చేతిని ముందుకు చాపాడు.

"యస్. ప్రా...." అంటూ అతని చేతిలో చెయ్యి వెయ్యబోయి ఆగిపోయి "మి....స్" అంటూ పూర్తి చేశాను.

అతను చటుక్కున నా చేతిని అందుకుంటూ డియర్ మిస్ నీకు తొలి ప్రేమలేఖ ఇచ్చే అదృష్టం నాకే లభించిందన్నమాట" అన్నాడు.

నా చేతిని వెనక్కి లాగేసుకుంటూ అతనివైపు చూడలేక చుట్టూ చూస్తుంటే నా దృష్టిని ఆకర్షించిందో ఫోటో.

"ఆ ఫోటో ఎవరిది?" అడిగాను.

అతను ఆ ఫోటో షోకేస్ నుండి తీసి నా చేతికిచ్చి - "షి ఈజ్ మై వైఫ్. నా పెద్దకొడుకు అనూర్, పాప దీప్తి" అన్నాడు.

"మీకు ..... మీ....కు.... పెళ్లై...యిందా" ఆశ్చర్యాన్ని అదిమి పెట్టలేక అడిగాను.

"అలా కన్పించటం లేదు కదూ. చాలా యంగ్ ఫెలోగా కన్పిస్తాన్లే" అన్నాడు కాస్త గర్వంగా నవ్వుతూ.

నీ తలకాయ. నే ఆశ్చర్యపోతున్నది నీ శరీరాకృతి గురించి కాదు. నీ మనస్థితి

గురించి. వివాహితుడు, ఇద్దరు పిల్లల తండ్రి ఓ స్త్రీని అదే తొలి స్పందన అన్నంత గొప్పగా ఐ లవ్ యూ అనగలడా? అనగలడని నాకిన్నాళ్ళూ తెలియదు. అసలు, అలా ఎలా అనగలడు? ఎందుకంటాడు? ఆలోచించే స్థితి నుండి స్తబ్దతకి జారిపోతున్న మనసుని ఆపి "నే వెళతాను" అన్నాను.

"అప్పుడే?" ఆశ్చర్యంగా అన్నాడు.

"ఊఁ విషెస్ చెప్పానుగా"

"ఐ వాంట్ టు స్పెండ్ సమ్ టైమ్ విత్ యూ" అన్నాడు అర్థింపుగా.

"నే వెళ్లాలి".

"ప్లీజ్...." అంటూ నా బుగ్గల్ని స్పృశించబోయాడు.

"మీ మిసెస్ ఏరి?" అడిగాను అతడిని వారిస్తూ.

"ఊరు వెళ్లింది..."

"మీరిలా ప్రవర్తించటం బాగులేదు" నిర్మొహమాటంగా చెప్పాను.

"అది నా తప్పుకాదు. నీ అందం అటువంటిది.

"మీ భార్య అందంగా వున్నారు. ఆమెని ఎవరైనా ఇలా అడిగితే మీరు సహిస్తారా? అసలు అలా ఎప్పుడైనా వూహించారా?" అడిగాను.

"యూ డెవిల్. నా భార్య అటువంటి బజారు మనిషి కాదు" కోపంగా అన్నాడు.

ఆ కోపం చూస్తే నాకు నవ్వొచ్చింది. ఆమోదిస్తే నేనూ బజారు మనిషినే కదా అతని వుద్దేశ్యం.

"మీకు నీ భార్యపై వున్న నమ్మకానికి, గౌరవానికి ఆనందంగానే వుంది. కాని ఇలా నన్ను అడగటం తప్పని తెల్సి, అడగటం బాగులేదు. ఇదేం తప్పుకాదని, చాలా సాధారణ విషయమని మీరు భావిస్తే నన్ను డెవిల్ అనరు. మీ భార్య అటువంటిది కాదని చెప్పరు. మీరు ఆచరించే పద్ధతులపైనా, నడిచే మార్గంపైనా మీకే గౌరవం లేదు. అటువంటి వాటిలోకి మీ స్టూడెంట్స్‌ని లాగే ప్రయత్నం చెయ్యకండి" అని బయటికి వచ్చేశాను.

ఆ తర్వాత అతడెప్పుడూ నాతో అలా ప్రవర్తించలేదు. జువాలజీలో నాకు గోల్డ్ మెడల్ వచ్చినప్పుడు అతను నన్ను అభినందించాడు. కాని చిత్రమేమిటంటే మిగిలిన సబ్జక్ట్స్‌లో మార్కులు చూసినప్పుడు కలిగిన ఆనందం, ఆ జువాలజీలో మార్కులను చూస్తే కలగదు. ఆకాష్ పేరు వున్నతంగా తోచదు. ఒకప్పుడు అతడిలో ప్లస్ పాయింట్స్‌కి సాష్టాంగ ప్రమాణం చేసిన నా మనసు అతడిలో మైనస్ పాయింట్స్‌ని రవ్వంత కూడా సహించలేక పోతున్నది. ఎందుకని? బలహీనతలు మనిషికి సహజం కదా? అయినా ఎందుకతను నా దృష్టిలో అతితేలికైపోయాడు. ఒక్కటే కారణం. అతడికి స్త్రీపై గౌరవం లేదు. స్త్రీని గౌరవించని మగవాడు ఎంత మేధావి అయినా ఆమోదించటం నా రక్తంలోనే లేదు... అది నాకు ఆ రోజుల్లోనే తెల్సిపోయింది.

• *స్రవంతి, 27, ఏప్రిల్ 1989* •